క్లుప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జేగురుపాడులో ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి మందిరంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జాయింట్ సెక్రటరీ బిషప్ బి.రాజు వాక్యసందేశాన్నందించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ నాయకులు కరుణాకర్, పరంజ్యోతి, సీహెచ్ రత్నదీప్, జయశీ, డి.రత్నరాజు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పండ్ల వర్తక సంఘం కార్యవర్గం



శ్రీదేవి తోపుడు బండ్ల సంఘం కార్యవర్గ సభ్యులు

సీటీఆర్ఐ: శ్రీదేవి తోపుడు బండ్ల పండ్ల వర్తక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా కనకాల రాజా 16వసారి ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక లింగంపేటలోని సంఘం కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా కరోతి సత్యనారాయణ, సరగడ సూరిబాబు, పేకేటి సత్యనారాయణ, కార్యదర్శిగా మండల శ్రీనివాసరావు, కోశాధికారిగా వాడపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులను సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సంఘంలోని ఏ సభ్యుడికి కష్టం వచ్చినా తాను ముందుంటానన్నారు.

పోలీసు స్పందనకు 15 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రజనీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ మాట్లాడి, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ చేసి, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారుకు ఆదేశించారు.

ఫీల్డ్ ఆఫీసర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్లు, తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగదిత్య కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేయడానికి విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు అర్హులన్నారు. తపాలా ఏజెంట్లుగా 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగి, పదో తరగతి పాసైన స్త్రీ, పురుషులు కావాలన్నారు. వారు కేటాయించిన ప్రాంతాల్లో జీవితా బీమా మార్కెటింగ్, వినియోగదారుల సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 11 లోపు దరఖాస్తులను పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం అనే చిరునామాకు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94418 65857, 0891 - 2546204 నంబర్లను సంప్రదించాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడియం: ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం శ్యాంసుందర్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్యాంసుందర్ మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయన్నారు.

8 నుంచి సాయి మందిరం వార్షిక మహోత్సవాలు

సీటీఆర్ఐ: మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణం ఆనుకుని ఉన్న షిరిడీ సాయి మందిరం 11వ వార్షిక మహోత్సవాలు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామని అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ద్రాక్షారామకు చెందిన మైలవరపు నారాయణ బ్రహ్మత్వంలో దెందులూరు శ్యాంకుమార్ అర్చకత్వంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పారిజాత గిరి ప్రదక్షిణ

రాజానగరం/మధురపూడి: మాఘ పౌర్ణమి సందర్భంగా కోరుకొండలో శ్రీలక్ష్మీనరసింహుడు కొలువైన పారిజాత గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. దివాన్‌చెరువుకు చెందిన దేశ సంచార యాత్రికుడు పెన్నాడ మోహన్ సారథ్యంలో కొందరు భక్తులు బైకులపై కోరుకొండకు చేరుకున్నారు. సుమారు మూడు కిలోమీటర్లున్న పారిజాత గిరి చుట్టూ నమో నారసింహాయ అంటూ ప్రదక్షిణ చేశారు. అనంతరం గిరిపైకి మెట్ల మార్గాన చేరుకుని, స్వామిని దర్శించుకున్నారు.

నో ఎంట్రీ.. బేఖాతరు

- భారీ వాహనాలతో ట్రాఫిక్ చిక్కులు
- జరిమానాలతో సరిపెడుతున్న పోలీసులు

కంబాలచెరువు: జిల్లాలో వ్యాపార, వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఇటీవల ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. నిబంధనలను ఉల్లంఘించి భారీ వాహనాలు నగరంలోకి చొరబడుతూ ఈ సమస్యను జటిలం చేస్తున్నాయి. సాధారణంగా పగటిపూట వ్యాపార సమయాల్లో భారీ వాహనాలకు నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతి లేదు. అత్యవసరాలకు సంబంధించిన వాహనాలకు మాత్రమే ప్రవేశ అనుమతి ఉంది. వాణిజ్య సరుకుల లారీలు, ఇతర వాహనాలు లోపలికి వచ్చేందుకు ట్రాఫిక్ పోలీసులు కొన్ని సమయాలను ప్రకటించినా కొద్ది నెలలుగా అమలు కావడం లేదు.

కేసులు నమోదు

గత రెండు నెలల్లో నిబంధనలను ఉల్లంఘించిన భారీ వాహనాలకు సంబంధించి పోలీసులు 133 కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.2.66 లక్షలు జరిమానా విధించారు. భారీ వాహనాలు రాత్రి ఎనిమిది నుంచి ఉదయం ఎనిమిది గంటలలోపు నగరంలోపలికి ప్రవేశించి లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలు పూర్తి చేసుకుని బయటకు వెళ్లిపోవాలి. కొన్ని ఇబ్బందుల రీత్యా నిషేధిత సమయాల్లో కొంత వెసులుబాటు ఇచ్చారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకూ ఎటువంటి భారీ వాహనాలు రాకూడదు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల లోపు అన్‌లోడింగ్, లోడింగ్ అయిన వాహనాలు బయటకు వెళ్లిపోయేలా కొంత వెసులుబాటు కల్పించారు.





మెయిన్‌రోడ్డులోని జైన్ దేవాలయం, అప్సర థియేటర్ల వద్ద నిషేధిత సమయాల్లో భారీ వాహనాలు ప్రవేశించడంతో స్తంభించిన ట్రాఫిక్

మినహాయింపు ఆసరాగా..

అధికారులు స్వల్ప మినహాయింపును ఆసరాగా చేసు కుని కొందరు ఇష్టారాజ్యంగా భారీ వాహనాలతో నగరంలోకి ప్రవేశిస్తున్నారు. గంటల కొలదీ ట్రాఫిక్ సమ స్యను సృష్టిస్తున్నారు. హుకుంపేట, కోటిపల్లిబస్టాండ్, క్వారీ ఏరియాలలో ట్రాఫిక్ పోలీసులు గస్తీ కాస్తూ భా రీ వాహనాలను ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు. అయితే కొందరు అడ్డదారుల్లో ప్రవేశించి నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేవలం జరిమానా విధిస్తున్నారే తప్ప గట్టిగా ఉక్కుపాదం మోపలేకపోతున్నారు. లోపలికి రానీయకుండా గట్టిగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఫలితంగా కొద్ది నెలలుగా ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది.

చర్యలు తీసుకుంటాం



రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ ఎక్కువే. ఉదయం, సాయంత్రం వేళ ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. భారీ వాహనాలను నగరంలోకి ప్రవేశిచించేందుకు కొన్ని సమయాలు సూచించాం. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించి లోపలికి ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై ట్రాఫిక్ పోలీస్‌లకు ఆదేశాలు జారీ చేస్తాం. ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తాం.

- ఎం.రజనీ, అడిషనల్ ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: పది విద్యార్థులను పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదివించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఆల్కాట్‌తోటలోని సత్యసాయి గురుకులం ఆడిటోరియంలో సోమవారం జిల్లాలోని 19 మండలాలకు చెందిన పదో తరగతి తెలుగు, గణితం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత మండలాల వారీగా ఇప్పటి వరకూ ఉన్న విద్యార్థుల స్థితిగతులు, స్థాయిలపై సమీక్షించారు. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో కూడా కేవలం చదివించడమే కాకుండా, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. మాదిరి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్, జవాబులు రాసే బుక్‌లెట్‌పై విద్యార్థికి అవగాహన కల్పించాలన్నారు. 9వ తేదీ నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, సత్యసాయి గురుకులం ప్రిన్సిపాల్ గురయ్య పాల్గొన్నారు.

గడువుకన్నా ముందుగానే అర్జీల పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: అర్జీదారులు తృప్తి చెందేలా స్పందన ఫిర్యాదులను నిర్దేశించిన గడువు కన్నా 24 గంటల ముందుగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం అర్జీలను ఆరు కేటగిరీలుగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఏ కారణం చేతనైనా స్పందన అర్జీని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించకపోతే.. సంబంధిత అధికారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 94 శాతం వలంటీర్ల హాజరు నమోదు కావడంపై అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, సీపీ జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

తుమ్మా దంపతుల సేవలు ఎనలేనివి



బుల్లి అమ్మాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ప్రముఖ దాతలు తుమ్మా సూర్యనారాయణ, బుల్లిఅమ్మాయి దంపతుల సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో బుల్లి అమ్మాయి సంస్మరణ కార్యక్రమం సోమవారం జరిగింది. కో ఆర్డినేటర్ చందన, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు తదితరులు బుల్లిఅమ్మాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా డైరెక్టర్ గిరజాల బాబ్జీ, ఏపీ పేపరుమిల్లు జీఎం వైవీ రావు, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు తాటికొండ విష్ణుమూర్తి, మెట్ల కౌశిక్, దాసరి శేషగిరి పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యం 83 శాతం పూర్తి

- కలెక్టర్ మాధవీలత
- అధికారులతో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 59 లక్షల పనిదినాలకు గాను 83 శాతం మేర లక్ష్యాలను పూర్తి చేశామని కలెక్టర్ మాధవీలత అన్నారు. మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి సోమవారం సాయంత్రం ఉపాధి హామీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, రబీ ధాన్యం కొనుగోలు, వ్యవసాయ యంత్ర సేవాపథకం, గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన అర్జీల పరిష్కారం, ఎపిక్ కార్డ్, 6బీ ఫారం, ఆధార్ అనుసంధానం వంటి అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఒకటినే పింఛన్ పంపిణీ పూర్తికి చర్యలు

కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే నెలల్లో జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ పంపిణీని ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేసేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాలన్నారు. మార్చిలో 2,36,251 మందికి గాను 2,34,125 మందికి 99 శాతం పంపిణీ చేశామన్నారు. జిల్లాలో వైఎస్సార్ యంత్ర సేవాపథకం అమల్లో భాగంగా 273 సిహెచ్‌సీ గ్రూపులు లక్ష్యానికి గాను 146 గ్రూపులను ఎంపిక చేసి, బ్యాంకు ఖాతాలను ప్రారంభించారన్నారు. రబీ పంటకు సంబంధించి రాజమహేంద్రవరం డివిజన్లో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లోనూ, కొవ్వూరు డివిజన్ సంబంధించి తాళ్ళపూడి, చాగల్లు మండలాల్లోనూ ముందస్తుగా కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీబ్యాగ్‌లు తదితర అంశాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 15,52,333 మంది ఓటర్లకు గాను 12,05,701 మందికి ఆధార్ అనుసంధానం 77 శాతం చేయడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ జి.నరసింహులు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

అభిమానుల ఆదరణ అభినందనీయం



విలేకరులతో మాట్లాడుతున్న సంపూర్ణేష్ బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ పరిశ్రమలోని అందరు హీరోల అభిమానులూ తనను ఆదరిస్తారని, వారి అభిమానం అభినందనీయమని సినీనటుడు సంపూర్ణేష్ బాబు అన్నారు. స్థానిక వీటీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ పక్కన ఉన్న శంకర్ జ్యూయలర్స్‌ను సోమవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ త్వరలో మూడు సినిమాలు చేస్తున్నానని, హృదయ కాలేయం దర్శకుడు సాయి రాజేష్‌తో మళ్లీ కలిసి పనిచేస్తానన్నారు. రాజమహేంద్రవరం ప్రజల ఆత్మీయత, ఆప్యాయత అనురాగం మర్చిపోలేనివన్నారు. శంకర్ జ్యూయలర్స్ అధినేత ధవళేశ్వరపు రవిశంకర్ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ పేరు ప్రఖ్యాతులు పొందిన హీరో సంపూర్ణేష్ బాబు విశ్వ బ్రాహ్మణుల ముద్దుబిడ్డ అని కొనియాడారు. కార్యక్రమంలో ధవళేశ్వరపు మాధురి, పొడుగు శ్రీను, లక్కోజి వీరభద్రస్వామి, పాలవలస బాబ్జీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయాలు

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట గానుగవీధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకట్రావుకు గాయాలయ్యాయి. దీనిపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఆదివారం రాత్రి విధులు పూర్తిచేసుకుని ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్, వెంకట్రావు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకట్రావుకు స్వల్పగాయాలయ్యాయి.

పుష్కరఘాట్‌లో శుభ్రతా కార్యక్రమం



ఘాట్‌ను శుభ్రం చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

రాజమహేంద్రవరం సిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతగా భావించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నగర శాఖ కార్యదర్శి గోపి పిలుపు నిచ్చారు. పుష్కర్ ఘాట్ వద్ద సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ – శ్రేష్ఠ భారత్ స్ఫూర్తితో స్వచ్ఛ రాజమహేంద్రవరం, శ్రేష్ఠ రాజమహేంద్రవరం అనే నినాదంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శూలాల పండగ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



శూలాలు గుచ్చుకుని వెళుతున్న భక్తులు



స్వామి రథం ఊరేగింపు

సీటీఆర్ఐ: నగరంలోని సోమవారం శూలాల పండగ వైభవంగా నిర్వహించారు. బర్మాకాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. పుష్కరఘాట్ వద్ద నుంచి భక్తులు వీపులకు శూలాలు గుచ్చుకుని స్వామి వారి రథం వెనకాల ఊరేగింపుగా వెళ్లారు. పుష్కరఘాట్ నుంచి శ్యామల సెంటర్, విద్యుత్ కాలనీ మీదుగా బర్మాకాలనీలోని స్వామి వారి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, సీహెచ్ మురళీకృష్ణ, నరసింహరావు, ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

గృహసారథులే పార్టీ రథసారథులు

- ప్రజలతో మమేకం కావాలి
- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గృహసారథులే పార్టీ రథసారథులని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ధవళేశ్వరం సచివాలయం-1కు సంబంధించి గొల్లపేట రామాలయం వద్ద , సచివాలయం-2కు సంబంధించి హీరా ఫంక్షన్ హాల్ వద్ద, సచివాలయం-3కు సంబంధించి మార్కెట్ కమ్యూనిటీ హాల్ వద్ద, సచివాలయం-4కు సంబంధించి ఎర్రకొండపై నూతనంగా నిర్మించిన సచివాలయం వద్ద సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్దేశించిన మార్గంలో వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు నడవాలని సూచించారు. గృహసారథులకు నిర్దేశించిన కుటుంబాలను కలిసి, వారితో కనీసం 20 నిమిషాలు మాట్లాడాలన్నారు. పథకాలు పొందడంలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వలంటీర్‌కు తెలియపరిచి, పరిష్కరించే దిశగా సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దండగల మరిడయ్య, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సోమేశ్వరుని రథోత్సవం



మురమండలో సోమేశ్వరుని రథోత్సవం

కడియం: మురమండలోని సర్వకామదాంబ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. మేళతాళాలు, భాజాభజంత్రీలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల్లో రథోత్సవం జరిగింది. కాగా.. ఈనెల మూడో తేదీ నుంచి ఆలయ అర్చకుడు బాదంపూడి బుచ్చయ్యలింగం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, అన్నసమారాధన తదితర కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలో వీరబాబు మృతదేహం

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై నీలాద్రిరావుపేట వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడియానికి చెందిన వీరబాబు (40), రామకృష్ణ మోటారు సైకిల్‌పై అనకాపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నీలాద్రిరావుపేట శివారు వాటర్ ట్యాంక్ సమీపంలోకి వచ్చేసరికీ వారు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ అదుపుతప్పి జారిపడింది. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం 108లో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై మట్టి ఉండడంతో మోటారు సైకిల్ అదుపు తప్పి జారిపడినట్టు స్థానికులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కడియం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దక్షిణ మండలం డీఎస్పీ ఎం.శ్రీలత అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేమగిరిలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. గాయని పసల బేబీ తన పాటలతో అలరించారు. అనంతరం పసల బేబీ, పది మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. యూటీఎఫ్ మహిళా కమిటీ నాయకులు ఎం.వనజ, మండల అధ్యక్ష, కార్యదర్శులు బీఏవీ ఆనంద్ కుమార్, ఆకుల వీర్రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతిరాయ్, యూటీఎఫ్ నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు, సాక అనిత, ఈవీవీఎస్ఆర్ ప్రసాద్, పల్లి రాజు, బి.సుధ పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ దేవాలయమైన రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. నారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఈ కల్యాణం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ 7.30 గంటలకు ఘనంగా కల్యాణోత్సవం జరిగింది. లక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం రాత్రి 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఉత్సవాల సందర్భంగా కొండపై వరకూ ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి కల్యాణ మండపంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.